క్లుప్తంగా

సబ్‌కలెక్టర్ కార్యాలయానికి 14 అర్జీలు



తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో మొత్తం 14 అర్జీలు వచ్చాయి. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ సెలవులో ఉండటంతో గుంటూరు నుండి డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి పీజీఆర్ఎస్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి నాలుగు అర్జీలు రాగా, పట్టణ మునిసిపాలిటీ, సర్వే డిపార్టుమెంట్ల పరిధిలోనివి రెండేసి అర్జీలు వచ్చాయి. పోలీసు శాఖకు చెందిన అర్జీలను ముగ్గురు ఇచ్చారు. గృహనిర్మాణ సంస్థ పరిధిలో ఒకటి, వైద్యశాఖకు చెందిన అర్జీ ఒకటి, పంచాయతీ రాజ్‌కు సంబంధించి మరొక అర్జీ వచ్చాయని లక్ష్మీకుమారి తెలియజేశారు. ఆయా అర్జీలను సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లకు దరఖాస్తులు చేసుకోండి



తెనాలిఅర్బన్: పట్టణంలో వ్యాపారాలు చేసుకునే ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్‌లను పొందాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 1వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఎక్కడికక్కడ వ్యర్థాల గుట్టలు ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. అలాగే కొన్ని దుకాణదారులకు ట్రేడ్‌లైసెన్స్‌లు లేకపోవడం గమనించిన ఆయన వెంటనే వాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పలువురు సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు



తెనాలిఅర్బన్: పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ఓ దుకాణదారుడు తన షాపు ముందు అక్రమంగా ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను సోమవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ మాట్లాడుతూ మురుగు కాల్వలపై ఎటువంటి గ్రిల్స్, ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేయవద్దని సూచించారు. మున్సిపల్ స్థలంలో ఏర్పాటు చేసే ప్రతి అక్రమణను తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు, పలువురు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై మద్యం మత్తులో ఓ యువకుడు సోమవారం సాయంత్రం దాడికి పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం మహానాడుకు చెందిన మణికంఠ అనే యువకుడు మద్యం తాగి రోడ్డుపై వచ్చిపోయే వాహనాలకు అడ్డు పడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కర్నూలు 6వ బెటాలియన్ కానిస్టేబుల్ సతీష్ అతడ్ని పక్కకు వెళ్లమని చెప్పాడు. దీంతో అతను కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడు. మణికంఠను తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌లో అతను ప్రశాంతంగా నిద్రపోయాడు.

శ్మశాన స్థలం కేటాయించాలి



ఫిరంగిపురం: మాదిగ సామాజిక వర్గానికి ప్రత్యేక స్మశాన స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. పొనుగుపాడు గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం మాదిగ కాలనీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారి దృష్టికి వచ్చిన పలు అంశాలు తెలియజేశారు. ఉపాధి హామీ వేతనాలు ప్రతి వారం ఇవ్వడం లేదని చెప్పారు. ప్రతిరోజు రూ.200 మించి కూలి పడటం లేదని పేర్కొన్నారు. పనిముట్లు, కొత్తవారికి జాబ్ కార్డులు, మెడికల్ కిట్లు ఇవ్వడం లేదని తెలిపారు. సర్వేలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ నాయకులు షేక్ మస్తాన్‌వలి, కె.కోటేశ్వరరావు, కె.రమేష్, కె.కోటేశ్వరరావు, కె. వెంగళరావు పాల్గొన్నారు.

15 రోజుల్లో పరిహారం అందకపోతే ఆందోళన

- ప్రస్తుత ఆందోళన తాత్కాలికంగా వాయిదా
- రాష్ట్ర పసుపు రైతు సంఘం కన్వీనర్ జొన్న శివశంకరరావు వెల్లడి



మాట్లాడుతున్న శివశంకరరావు

తెనాలి: ఏడాది క్రితం జరిగిన దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాద ఘటనలో నష్టపోయిన పసుపు రైతుల నష్టపరిహారంపై తెనాలి న్యూఇండియా అస్యూరెన్స్ కార్యాలయం వద్ద జరగాల్సిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు రాష్ట్ర పసుపు రైతు సంఘం కన్వీనర్ జొన్న శివశంకరరావు చెప్పారు. స్థానిక ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కార్యాలయం నుంచి వచ్చిన హామీపై రైతులతో నిర్వహించాల్సిన ధర్నా ప్రస్తుతానికి నిలిపివేశామని చెప్పారు. దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజీ ఘటనపై పసుపు రైతులకు బీమా పరిహారం ఇప్పటికీ దక్కకపోవడం విచారకరమన్నారు. నష్టపరిహారానికి సంబంధించి రైతులకు అందాల్సిన బీమాతోపాటు రూ.7 వేలు నష్టపరిహారం చెలిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు గతంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పలు ప్రజాసంఘాలతో కలిసి స్థానిక మారిస్‌పేటలోని న్యూఇండియా అస్యూరెన్స్ అధికారులతో చర్చలకు వెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా రాబోయే 15 రోజుల్లో రైతులకు అందాల్సిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలసి పెద్దఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాద ఘటనలో సుమారు 1.44 లక్షల పసుపు బస్తాలు దగ్ధమైనట్టు చెప్పారు. రాష్ట్ర మంత్రులు ప్రకటించిన నష్టపరిహారం దక్కక రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నా రైతులకు కనీసం బీమా కూడా దక్కకపోవడం అన్యాయమన్నారు. ఘటనపై వేసిన ప్రభుత్వ కమిటీలు కూడా ఘటనపై సమగ్ర వివరణ ఇవ్వలేకపోతున్నాయని అన్నారు. కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం తీరు రైతుల్లో సంక్రాంతి అశుభాన్ని మిగిల్చిందని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. ఆర్థిక సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి పసుపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరితో తెనాలి డివిజన్ రైతు సంఘం అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు, పోతురాజు కోటేశ్వరరావు, ఆర్టీసీ విశ్రాంత పెన్షనర్ల సంఘం జిల్లా నాయకుడు కన్నెగంటి శివశంకరరావు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ఫాతిమాకు రజత పతకం



ఫాతిమాకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎండీ మురళీకాంత్

తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌కు చెందిన ఆరోవ తరగతి విద్యార్థిని షేక్ సనా ఫాతిమా అండర్ -12 బాలికల విభాగంలో ద్వితీయ స్థానంతో పాటు రజత పతకం సాధించినట్లు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రేపల్లెలోని ఈ నెల 11,12 తేదీలలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహానాడులో మాయగాడు దొరికాడు

- రెండు నెలల వ్యవధిలో ఐదు ఇళ్లల్లో చోరీ
- పాత నేరస్తుడు షేక్ హుస్సేన్ అలియాస్ బెగ్గర్
- అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరు పరిచిన పోలీసులు
- 82 గ్రాముల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రవికుమార్



షేక్ హుస్సేన్ అరెస్ట్ చూపిస్తున్న లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవికుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో 66 రోజుల్లో 5 ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు జరిగాయి. బంగారం, వెండి ఇతర విలువైన వస్తువులను దోచుకుని తమకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పాత నేరస్తుడిని ఎట్టకేలకు తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసుకు సంబంధించి లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు కరకట్ట నివాసితుడు షేక్ హుస్సేన్ ఎలియాస్ బెగ్గర్ జల్సాలకు, వ్యసనాలకు బానిసయ్యాడు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గతేడాది డిసెంబరు 20న మహానాడు 21వ రోడ్డులో కె.సునీత అనే మహిళ 50 గ్రాముల బంగారం దొంగిలించాడు. మరుసటి రోజే 16వ లైన్‌లో కె. శ్రీనివాసులు అనే వ్యక్తి ఇంటిలో 3.980 గ్రాముల బంగారం, 31న 10వ లైన్‌లో కె.ప్రసాద్ ఇంటిలో 18.020 గ్రాముల బంగారం, జనవరి 4న 6వ లైన్‌లో ఎం.కరుణాకర్ ఇంటిలో 4.020 గ్రాముల బంగారం, 70 గ్రాముల వెండి, జనవరి 16న 13వ లైన్‌లో వి.రమేష్‌కుమార్ ఇంటిలో 6 గ్రాముల బంగారం, రూ.25 వేల నగదు చోరీ చేశాడు. చోరీ చేసిన బంగారాన్ని హుస్సేన్.. మహానాడు మణిపాల్ హాస్పిటల్ వద్ద ఒక వ్యక్తికి అమ్ముతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని 82.02 గ్రాముల బంగారం, 70 గ్రాముల వెండి, రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందనలు తెలిపినట్లు చెప్పారు. ఈ సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు ఒకటి... కేసు మరొకటి

తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన దొంగతనాల్లో బాధితుల వర్షన్ మరోలా ఉంది. తాము ఒకలా ఫిర్యాదు ఇస్తే.. మరోలా ఫిర్యాదును పోలీసులు నమోదు చేస్తున్నారని చెబుతున్నారు. అది కూడా ఫిర్యాదు చేసిన కొంతకాలం తర్వాత మళ్లీ మరల ఫిర్యాదు తీసుకుని కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం స్తున్నారు. ముద్దాయి ఎస్కే హుస్సేన్ పాత నేరస్తుడే. దీంతో పోలీసులు అతనిపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో మంగళగిరి పట్టణానికి చెందిన ఓ బంగారు వ్యాపారస్తుడికి దొంగిలించిన బంగారం మొత్తం అమ్మినట్లు విశ్వసనీయ సమాచారం. తాడేపల్లికి సంబంధించిన ఓ కానిస్టేబుల్‌కు మంగళగిరి సబ్ డివిజన్‌లోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేసిన సమయంలో సదరు బంగారం వ్యాపారితో పరిచయం ఏర్పడిందని, అతని నుంచి కొంత రికవరీ చేసి, మరికొంత బంగారానికి సంబంధించి బేరసారాలు ఆడినట్లు ఆరోపణలొస్తున్నాయి.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: విద్యార్థులు సృజనాత్మకత వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో పాఠశాలలో సోమవారం వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలోనూ ఏదో ఒక సృజనాత్మకత దాగి ఉంటుందని తెలిపారు. దానిని గుర్తించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. తెలుగు భాషను అభివృద్ధి పరిచేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన చైనీస్ పజిల్, హైడ్రోజన్ ట్రైన్, మెట్రో ట్రైన్, రాత్రి పగలు ఏ విధంగా తిరుగుతాయనే తెలియజేసే పరికరం ఈ ప్రదర్శలో ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. సుమారు 500 మంది విద్యార్థులు ఎక్స్‌పోలో తమ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ చినబాబు, రెవరండ్ ఫాదర్ జోస్, ఫాదర్ మర్రెడ్డి, ఫాదర్ జోసఫ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

- వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- మల్కాపురం, బోరుపాలెం నాయకులు, కార్యకర్తల సమ్మేళనం

మల్కాపురం(తాడికొండ): పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం తప్పక ఉంటుందని వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు భరోసానిచ్చారు. తుళ్లూరు మండలం మల్కాపురం, బోరుపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలు, నాయకులే పునాదులన్నారు. వారికి కష్టం కలిగితే వెన్నంటే ఉండి అండగా నిలుస్తానన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. లోపాలను ఎండగట్టాలన్నారు. కార్యకర్తలకు తాను నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మీజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, నాయుడు నాగేశ్వరరావు, డీజే శ్రీనివాసరావు, బోరుపాలెం నాయకులు చనుమోలు రామారావు, తోకల రాఘవ, వసంతరావు, అర్లయ్య, మల్కాపురం నాయకులు పొన్నెం సురేష్, గోచిపాత నాగేశ్వరరావు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తెనాలి: నియోజవర్గంలోని వివిధ గ్రామాలల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాళ్ళ పోస్టుకు అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెనాలి ప్రాజెక్ట్ అధికారి ఎం.సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఫిబ్రవరి 05 తారీకు సాయంత్రం 5గంటల లోపు ప్రాజెక్ట్ కార్యాలయంలో పూర్తి సమాచారంతో దరఖాస్తు అందజేయాలని సూచించారు. దరఖాస్తు పారంలో ఎటువంటి తప్పలు ఉన్న అర్జీలను రద్దు చేయటం జరుగుతుందన్నారు. తెనాలి నియోజక వర్గంలోని మహిళలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12వ వార్డులో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించండి

తెనాలిఅర్బన్: 12వ వార్డులోని పలు వీధుల్లో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. 30వ వార్డులోని మున్సిపల్ స్థలంలో కూరగాయల సాగును నిలిపివేయాలని, 32వ వార్డులో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, గాంధీచౌక్‌లోని వీఎస్సార్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న అక్రమ కట్టడాలను ఆపివేయాలని, 30వ వార్డులో మురుగు కాల్వల పూడికతీత పనులు చేపట్టాలని పలువురు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వినతి పత్రం అందజేశారు. వీటన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు త్వరగా చెల్లించండి

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఇంటి, ఖాళీ స్థలం, నీటి కుళాయి పనులను త్వరగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ బిల్డర్ కాట్రగడ్డ వెంకటేశ్వరరావు రూ.4.10 లక్షలు, గడ్డిపాటి శివరామకృష్ణ రూ.2.34 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో చెల్లించాల్సిన వారు తమకు తెలియజేస్తే సిబ్బందిని వారి వద్దకు పంపుతామని చెప్పారు.

22 నుంచి ప్రత్యేక సదరమ్ క్యాంప్‌లు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెనాలి జిల్లా వైద్యశాలలో ఈ నెల 22 నుంచి 24వరకు ప్రత్యేక సదరమ్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు. ఆప్తామాలజీ, ఈఎన్‌టీ శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రతినెల వీటిని నిర్వహించే అవకాశం ఉందన్నారు. గతంలో సదరమ్ సర్టిఫికెట్ పొందిన ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన సమయంలో వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. తెనాలి మండలం అంగలకుదురు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి పట్టణం, అంగలకుదురు, దుండిపాలెం గ్రామాలకు చెందిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1.02 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

అది ఏపీ ఫైబర్ నెట్ డ్రోన్

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరిలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంపై రెండు రోజుల క్రితం డ్రోన్ కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం అడిషనల్ ఎస్పీ రవికుమార్ క్లారిటీ ఇచ్చారు. డ్రోన్ ఏపీ ఫైబర్ నెట్‌కు చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు. మంగళగిరి ప్రాంతంలో ట్రాఫిక్, శానిటేషన్, రోడ్ల అంశాలపై పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఫైబర్ నెట్ అధికారులు డ్రోన్ ఎగురవేసినట్లు తెలిపారు. ఆ ఒక్కరోజే కాదని, గత మూడు రోజులోగా ఆ డ్రోన్ ఎగురవేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ అధికారులతో చర్చించాకే ఈ నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో ఆక్రమణల తొలగింపు



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను సోమవారం అధికారులు తొలగించారు. నగరపరిధిలోని సర్వే నంబరు 134లో రత్నాల చెరువు ప్రాంతంలో అక్రమణలు జరిగినట్లు నగరపాలక సిబ్బంది గుర్తించారు. పలువురు ఆక్రమించుకుని ప్రహరీలు, బేస్‌మెంట్లు నిర్మాణం చేశారు. సదరు ఆక్రమణలను గుర్తించిన నగరపాలక సంస్థ సిబ్బంది అధికారుల ఆదేశాల మేరకు పొక్లెయిన్ సాయంతో ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ ఆక్రమణల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే నగరపాలక సంస్థ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. చెరువులు, నీటి గుంటలు, ప్రభుత్వ భూములు కావాల్సిన ఆవశ్యకత ఉందని, ఈ విషయంలో అధికారులు, సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

రోడ్లపై చెత్త లేకుండా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ దుబాయ్‌బాబు

తెనాలిఅర్బన్: రోడ్లపై చెత్తలేకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 21,22 వార్డులలో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

మురుగు కాల్వలు అధ్వాన్నంగా ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజు కాల్వలు శుభ్రం చేయా లని సూచించారు. అలాగే ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తెనాలిలో న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

తెనాలి రూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పొన్నూరు టౌన్ సి.ఐ, ఎస్.ఐ లని తీరును ఖండిస్తూ వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పొన్నూరు పోలీస్ స్టేషన్ లో ఒక సీనియర్ న్యాయవాది బేతాళ ప్రకాశరావుని నిర్బంధించి విచక్షణ రహితంగా కొట్టడడమేకాక అతనిపై తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేసినందుకు నిరసిస్తూ గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కోర్టు విధులను బహిష్కరించి తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై పోలీసుల దాడి అమానుషమని అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన పోలీసులు న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. న్యాయవాదులపై గౌరవం లేకుండా పోలీసులు విచక్షణ రహితంగా, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ ఈ ఘటనకు కారణమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని న్యాయవాదికి న్యాయం చేయాలని, తక్షణమే వారిని అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. అంతేకాక దీనిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీ శంకర్, అప్పల కిషోర్, అబ్దుల్ ఆరిఫ్, కంచర్ల కోటేశ్వరరావు, రెడ్డి వెంకటేశ్వరరావు, నాగళ్ళ హరీష్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'కాటూరి' ఆర్ట్ గ్యాలరీలో రతన్‌టాటా విగ్రహాలు

ప్రదర్శనను ప్రారంభించిన మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి



రతన్‌టాటా విగ్రహాల వద్ద రాజకుమారి, మురళి, శిల్పకారులు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ప్రముఖ శిల్పకారులు, సూర్యశిల్పశాల నిర్వాహకులైన తండ్రీ కొడుకులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలు రూపొందించిన ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, వితరణశీలి రతన్‌టాటా విగ్రహాలతో ప్రదర్శనను ఏర్పాటుచేశారు. పట్టణ సమీపంలోని కంచర్లపాలెం వద్ద గల కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఈ ప్రదర్శనను మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, అంగలకుదురుకు చెందిన గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి సోమవారం ప్రారంభించారు. భారతదేశానికి ఎంతగానో సేవల నందించిన రతన్‌టాటా విగ్రహాలను సజీవ శిల్పంలా రూపొందించిన శిల్పకారులను రాజకుమారి అభినందించారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీ తెనాలికి గర్వకారణమని, ఇక్కడ అడుగుపెడితే మరో ప్రపంచంలోకి అడుగిడిన అనుభూతి కలుగుతోందని ఆమె అన్నారు. తాను ఎమ్మెల్సీగా ఉండగా వివిధ రాష్ట్రాలను పర్యటించాననీ, ఎక్కడా ఇలాంటి గ్యాలరీని చూడలేదన్నారు. శిల్పకారులు కాటూరి, ఆయన కుమారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచం మొత్తంలో చైనాలోనే భారీ విగ్రహాలు తయారు కావడానికి కారణం, అక్కడి ప్రభుత్వాలు కళాకారులకు సహకరించడమేనని చెప్పారు. రాజధాని ప్రాంతంలో స్థలం కేటాయిస్తే రాష్ట్రం గర్వపడే ఆర్ట్ గ్యాలరీని నిర్మించి, వందలాది మందికి ఉపాధిని కల్పిస్తామని అన్నారు.

గోవర్ధనుడి సన్నిధిలో గీతాలాపన



గీతాలాపనలో పాల్గొన్న బృందం

తెనాలి: పట్టణ నెహ్రూరోడ్ లోని రుక్మిణీ సత్యభామసమేత శ్రీగోవర్ధనస్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం సాయంత్రం సంకీర్తనల గీతాలాపన జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లాశాఖ ఆధ్వర్యంలో ప్రోగ్రాం అసిస్టెంట్ ఈ.అమ్మడు పర్యవేక్షణలో హరినామ సంకీర్తన బృందం గురువు పెరవలి వంశీకృష్ణ శిష్య బృందం సాయంత్రం 6.30 గంటల్నుంచి రెండు గంటలసేపు సంకీర్తన గానం చేశారు. ధార్మిక సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఈనెల 24వ తేదీవరకు దేవస్థానంలో జరుగుతుందని తెలిపారు. చివరిరోజున అమ్మవారికి విశేష కుంకుమార్చన చేస్తారు. సంకీర్తన గానంలో టీవీఎస్ శాస్త్రి, లక్ష్మీనరసింహారావు, శివశంకరరాజు, అందె బాల చంద్రమౌళి, మాదాల సాయిహనుమంతరావు, నందికంటి రామాంజనేయులు, సంకీర్తన బృందం మాదాల నాగఅర్చన, అందె రాజేశ్వరి, తన్మయి తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, కొప్పురపు అనిత మాధవి, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మి, శ్రీపూజిత, కొత్తమాసు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

తాడికొండ: నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడం, పరిశోధన సహకారాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయం, ఐఐటీ చెన్నై మధ్య అవగాహనా ఒప్పందం కుదిరిందని వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి తెలిపారు. సోమవారం గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ రఘునాథన్ రంగనాధన్ రంగస్వామితో మొదటి ఒప్పందం జరిగిందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చెన్నై నేతృత్వంలోని ప్రతిష్టాత్మక ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవరేనెస్ ప్రాజెక్టు కింద వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయాన్ని స్పోక్ ఇనిస్టిట్యూట్‌గా గుర్తిస్తూ 2వ అవగాహనా ఒప్పందం జరిగినట్లు తెలిపారు. ఈ మేరకు వీఐటీ ఏపీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటరెడ్డి, ఐఐటీ చెన్నై ఐసీఎస్ఆర్ డీన్ డాక్టర్ మను సంతానం సంతకం చేశారు. ఈ సందర్భంగా వీఐటీ- ఏపీ వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందాల వల్ల వీఐటీ- ఏపీ వర్శిటీ కీర్తి మరింత పెరుగుతుందని, దీని ద్వారా ఇరు సంస్థల మధ్య జ్ఞాన మార్పిడికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రముఖులు, వీఐటీ- ఏపీ వర్శిటీకి చెందిన డాక్టర్ అమిత్ చవాన్, డాక్టర్ సుధాకర్ ఇలంగో, డాక్టర్ శిబి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.